

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

# గంగులపై ఆరోపణలు నిరూపిస్తావా..?

- తప్పు అని నిరూపించడానికి మేము సిద్ధం
- గుడిలో ప్రమాణానికి నీవు సిద్ధమా..?
- నేడు మహాలక్ష్మి ఆలయానికి వస్తాం
- బండి సంజయ్‌కి బీఆర్ఎస్ నగర అధ్యక్షుడి సవాల్

కార్పొరేషన్, నవంబర్ 18: 'ఎన్నికల ప్రచారంలో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ ఆధారాలు లేకుండా మంత్రి గంగుల కమలాకర్ ప్రతిష్టకు భంగం కలిగించేలా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. అవి తప్పు అని నిరూపించేందుకు మేము గుడిలో ప్రమాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. బండి సంజయ్ ప్రమాణం చేయడానికి సిద్ధమా..?' అని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ సవాల్ చేశారు. తన ఆలయం అని చెప్పుకుంటున్న నగరంలోని మహాశక్తి ఆలయానికి ఆదివారం బీఆర్ఎస్ నగర శాఖ తరఫున తాము వస్తామని, మరి బండి సంజయ్ వస్తారా..? అని ప్రశ్నించారు. ఒక వేళ ప్రమాణం చేయడానికి రాకపోతే తాను చేసిన ఆరోపణలన్నీ తప్పు అని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక 37వ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చల్ల హరిశంకర్ మాట్లాడారు. కరీంనగర్ అభివృద్ధి కోసం బండి సంజయ్ రూపాయి కూడా తీసుకురాలేదని నిరూపిస్తామన్నారు. భూకబ్జాలు చేశారని ఆరోపణలు చేస్తున్న బండి సంజయ్ అవి ఎక్కడ చేశారో నిరూపించాలన్నారు. గంగుల కుటుంబానికి 1991 నుంచే గ్రానైట్ వ్యాపారం ఉందన్నారు. నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన గంగులపై విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. నగర ప్రజలు సంజయ్‌కి బై బై చెబుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో పాదయాత్ర పేరుతో కోట్ల రూపాయలు దుర్వినియోగం చేశారన్న ఆరోపణలతోనే పదవి నుంచి తప్పించారని పేర్కొన్నారు. బీజేపీలో జాతీయ ప్రధాన కార్యదర్శులందరిని ఇన్‌చార్జిలుగా నియమిస్తే, బండి సంజయ్‌ని ఎందుకు నియమించలేదో చెప్పాలన్నారు. కరీంనగర్‌కు సీఎం కేసీఆర్ వస్తుంటే 50వేలకు పైగా ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారన్నారు. సీఎం కేసీఆర్ సభ విజయవంతమవడంతో ప్రతిపక్షాలకు కండ్లు బైర్లు కమ్మాయన్నారు. బీఆర్ఎస్ గెలుపును జీర్ణించుకోలేకే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఈసారి ఎన్నికల్లో బండి సంజయ్‌కి డిపాజిట్ కూడా దక్కదన్నారు. సీఎం కేసీఆర్ సభకు భారీగా ప్రజలు తరలివచ్చి విజయవంతం చేసినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గడ్డం ప్రశాంత్‌రెడ్డి, నవాజ్, వాజిద్, సాయి, వంగ హరీశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు కరీంనగర్‌కు హైకోర్టు న్యాయమూర్తి



వేణుగోపాల్

కోర్టుచౌరస్తా, నవంబర్ 18: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ ఆదివారం కరీంనగర్‌కు రానున్నారు. ఉదయం 11:30కు మంకమ్మతోటలోని వారి స్వగృహానికి చేరుకుంటారు. అనంతరం వసుధ కన్వెన్షన్, దేశరాజుపల్లి, జగిత్యాల రోడ్డులో తొగరు వెంకటరమణారెడ్డి కుమారుడి వివాహ వేడుకకు హాజరు కానున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో జరుగుతున్న 18వ సీఎస్ఐ స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జస్టిస్ వేణుగోపాల్ హాజరు కానున్నారు. కార్యక్రమంలో రీజినల్ డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి, డీఈవో జనార్దన్ రావు, సెయింట్ జాన్స్ అలుమిని సభ్యులు, 56వ డివిజన్ కార్పొరేటర్ వి రాజేందర్‌రావు, మాజీ కార్పొరేటర్లు ఏవీ రమణ, వి సత్యనారాయణరెడ్డి, డాక్టర్ కేవీ త్రినాథ్ రెడ్డి, బద్రోద్దీన్ కమాని, పసుల మహేశ్, ఎం దిలీప్, డాక్టర్ సాయిప్రసాద్, డాక్టర్ బీ రవి ప్రసాద్ కుమారులు అతిథులుగా పాల్గొంటున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి సీఎస్ఐ అనుబంధ 23 పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నారు. న్యాయమూర్తి ఈవీ వేణుగోపాల్ ఈ పాఠశాల పూర్వ విద్యార్థి కూడా. తన మొదటి వేతనాన్ని పాఠశాల అభివృద్ధికి, మెరిట్ విద్యార్థులకు అందజేశారు.

# ఎన్నికల ఖర్చులు పకడ్బందీగా పరిశీలించాలి

- కేంద్ర ఎన్నికల వ్యయపరిశీలకులు శివ్ శంకర్, చిట్టే యోగేష్ సుగ్డే

కలెక్టరేట్, నవంబర్ 18: ఎన్నికల ఖర్చులను మరింత పకడ్బందీగా పరిశీలించాలని కేంద్ర ఎన్నికల వ్యయపరిశీలకులు శివ్ శంకర్, చిట్టే యోగేష్ సుగ్డే సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎక్సైజ్, ఎల్‌డీఎం, సీ-విజిల్, ఎంసీసీ, ఎంసీఎంసీ, ఎక్సపెండిచర్ నోడల్ అధికారులతో ఎన్నికల ఖర్చులపై సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చులపై మరింత నిశితంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. బ్యాంకుల ద్వారా జరిగే లావాదేవీలపై దృష్టి సారించాలని, పోటీలో ఉన్న అభ్యర్థులతో పాటు, ఇతర బ్యాంకు ఖాతాలపై దృష్టి సారించాలని తెలిపారు. మద్యం అమ్మకాలపై దృష్టి సారించాలని, గత సంవత్సరం నుంచి ఇప్పటి వరకు జరిపిన మద్యం అమ్మకాలను పరిశీలించాలని ఆదేశించారు. సీ-విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను పరిశీలించాలని పేర్కొన్నారు. జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులను ఏ విధంగా చేయాలి అని తెలియజేసే కార్యక్రమాలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రతీ రోజు వ్యయం, ఖర్చులకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో డీసీవో రామానుజాచారి, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్, ఎల్‌డీఎం ఆంజనేయులు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగార్జున, సమాచార శాఖ సహాయ సంచాలకులు అబ్దుల్ కలీం, డీఈ సి.హెచ్. కొండయ్య, ఎన్ఈఐవోశి వరాం తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెసోళ్లు..ఇక చేసేదేమీ లేదు

- బీఆర్ఎస్‌తోనే సమగ్రఅభివృద్ధి
- కేసీఆర్ వస్తేనే పేదలకు మరిన్ని పథకాలు
- అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌కే ఓటేయాలి
- హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్



ముది మాణిక్యంలో నినదిస్తున్న హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్

చిగురుమామిడి, నవంబర్ 18: ' తెలంగాణలో బీఆర్ఎస్‌తోనే సమగ్రాభివృద్ధి జరిగింది. రాష్ట్రంలో కాంగ్రెసోళ్లు అభివృద్ధి చేయడానికి ఏమీ లేదు. ఎన్నికల వేళ కనిపించే కాంగ్రెసోళ్లను నమ్మవద్దు. అభివృద్ధి చేసిన సీఎం కేసీఆర్‌కు మరోసారి ఓటేయాలి' అని హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ ప్రజలను అభ్యర్థించారు. మండలంలోని ముది మాణిక్యం, రామంచ, ముల్కనూర్, పీచుపల్లిలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పనిచేసే వారిని గెలిపించి ప్రగతికి బాటలు వేయాలని ఓటర్లను కోరారు. గ్రామా ల్లో వీధుల వెంట తిరుగుతూ మహిళలను, వృద్ధులను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా సతీశ్‌కుమార్ మాట్లాడారు. పదేండ్లలో కరెంటు, నీటి కష్టాలు తీరాయన్నారు. బీఆర్ఎస్‌తోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని, మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపిస్తే సీఎం కేసీఆర్ మరిన్నీ సంక్షేమ పథకాలు అమలు చేస్తారన్నారు. కాంగ్రెసోళ్లు 60 ఏండ్లల్లో తెలంగాణను ఆగం చేసి, ఇప్పుడు ఏం చేస్తారని ప్రశ్నించారు. ఆ పార్టీ నాయకులు చెప్పే మాయ మాటలు నమ్మి మోసపోవద్దని ఓటర్లను కోరారు. నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. మండలంలో గోదావరి జలాల ద్వారా అనేక గ్రామాలకు సాగునీరు అందించి మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలంగా తీర్చిదిద్దిన ఘనత బీఆర్ఎస్‌దే అన్నారు. నేడు గోదావరి జలాలతో పంటలు పండించి రైతులు ఆనందంగా ఉంటున్నారని, వలసలు తగ్గాయన్నారు. పండిన పంటలను గ్రామంలోనే ప్రభుత్వం కొనుగోలు చేసి వారి ఖాతాలోనే డబ్బులు జమ చేస్తామని పేర్కొన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి, అభివృద్ధి చేస్తున్న బిఆర్ఎస్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా ఏకమవుతున్న శత్రువుల నాటకాలను రాబోయే 12 రోజుల్లో కారు గుర్తుకు ఓటు వేసి ముగింపు పలకాలని ఓటర్లను కోరారు. గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటా తిరిగి మ్యానిఫెస్టోను, ప్రభుత్వ పథకాలను బాధ్యతగా వివరించాలని కార్యకర్తలను కోరారు. ప్రచారంలో ఎంపీపీ కొత్త వినీత, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, మహిళా అధ్యక్షురాలు అందే సుజాత, సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి, ఆర్‌బీఎస్ మండల కో-ఆర్డినేటర్ పెనుకుల తిరుపతి, జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, సాంబారి కొమురయ్య, వైస్ ఎంపీపీ భేతి రాజిరెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ కరివేద మహేందర్ రెడ్డి, సర్పంచులు జక్కుల రవి, గుంటి మాధవి, ముప్పిడి వెంకట నరసింహారెడ్డి, పీచు లీల, ఎంపీటీసీలు పెసరి జమున, మండల నాయకులు ముప్పిడి దేవేందర్‌రెడ్డి, ముప్పిడి జయప్రకాశ్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బోయిని రమేశ్, గిట్ల తిరుపతిరెడ్డి, బుర్ర తిరుపతి, యాల్ల జనార్దన్‌రెడ్డి, ఆర్‌బీఎస్ గ్రామ కో-ఆర్డినేటర్లు ముంజ వెంకన్న, సిద్ధంకి రాజమల్లు, నాయకులు చెప్యాల నారాయణరెడ్డి, వొంటెల కిషన్‌రెడ్డి, దాసరి సాంబయ్య, గుంటి తిరుపతి, పెసరి రాజేశం, ఎడవెల్లి భాస్కర్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## రామంచలో బీఆర్ఎస్‌లో చేరికలు

రామంచలో గ్రామ శాఖ అధ్యక్షుడు గిట్ల తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన 150 మంది ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడానికి, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు.

# అభివృద్ధికి, అబద్ధాలకు మధ్యే ఎన్నికలు

- అభివృద్ధిని చూపి ఓట్లు అడుగుతున్నాం
- అబద్ధాలు ప్రచారం చేస్తున్న బండి సంజయ్
- ప్రజల సంపూర్ణ మద్దతు బీఆర్ఎస్‌కే
- నగర మేయర్ సునీల్‌రావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు

కార్పొరేషన్, నవంబర్ 18: 'పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో నగరంలో ఏం అభివృద్ధి చేశామో చెబుతున్నాం. మళ్లీ అధికారంలోకి వస్తే ఏం చేస్తామో చెప్పి ప్రజలను ఓట్లు అడుగుతున్నాం. కానీ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ మాత్రం అన్ని అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాడు. కరీంనగర్‌లో జరుగుతున్న ఎన్నికలు అభివృద్ధి, అబద్ధాలకు మధ్యే జరుగుతున్నాయి' అని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. కరీంనగర్ ఓటర్లను ప్రభావితం చేసేందుకు బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ లక్ష ఫోన్లు తెప్పించారని, ఓటర్లకు పంచేందుకు సిద్ధంగా ఉంచుకున్నారనే సమాచారం ఉందన్నారు. దాన్ని కప్పి పుచ్చుకొనేందుకే బీఆర్ఎస్‌పై అభాండాలు వేస్తున్నారని ఆరోపించారు. శనివారం స్థానిక ఎస్‌బీఎస్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెచ్చిన ఫోన్లను పంచేటప్పుడు దొరికిపోతే తప్పించుకునేందుకు ఈ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. 24 ఏండ్లు వివిధ ఎన్నికల్లో ఓటమి ఎరగని నాయకుడు గంగుల కమలాకర్ అన్నారు. అన్ని ఎన్నికల్లో ఓడిన వ్యక్తి బండి సంజయ్ అని విమర్శించారు. గెలిచిన తర్వాత ప్రజలు పూర్తిగా మరిచిపోయిన వ్యక్తి అని ఎద్దేవా చేశారు. ఓటు వేసిన ప్రజలకు న్యాయం చేయని వ్యక్తి బండి సంజయ్ అని తెలిపారు. నగరంలో చేపట్టిన అభివృద్ధిలో రాష్ట్రం నిధులు మాత్రమే ఉన్నాయని, కేంద్రం నుంచి నయా పైసా కూడ రాలేదన్నారు. బీజేపీ చరిత్ర, విధానం దౌర్జన్యమేనని విమర్శించారు. సంజయ్ చేస్తున్న నాటకాలన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. సంజయ్ మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. తీగలగుట్టపల్లి వద్ద చేపడుతున్న ఆర్‌వోబీ నిధులు కూడా రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన సీఆర్ఎఫ్ నిధుల నుంచే కేటాయించారని తెలిపారు. ఈ నిర్మాణానికి కేంద్రం నయా పైసా ఇవ్వలేదని విమర్శించారు. 40 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఎందుకు దృష్టి పెట్టలేదన్నారు. రైతుల ఆత్మహత్యలకు కాంగ్రెస్ కారణం కాదా..? అని ప్రశ్నించారు. గతంలో పండించిన పంటను కూడా అమ్మేందుకు రైతులు ఇబ్బందులు పడింది వాస్తవం కాదా..? అని నిలదీశారు. కాంగ్రెస్ పాలనలో కరీంనగర్ జిల్లాలో ఒక్క ప్రాజెక్టునైనా పూర్తి చేశారా..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇస్తున్న తప్పుడు హామీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, బీఆర్ఎస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకువస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోను ఎవరూ నమ్మరన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలను పట్టించుకోని కాంగ్రెస్.. ఇప్పుడు మోసపూరిత హామీలు ఎన్ని ఇచ్చినా ప్రజలు పట్టించుకోరని పేర్కొన్నారు. ప్రజలందరూ కూడా బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు గంట కళ్యాణి, చాడగోండ బుచ్చిరెడ్డి, వాల రమణరావు, గుగ్గిళ్ల జయశ్రీ, మాధవి, నందెల్లి రమ, నాయకులు చంద్రమౌళి, మైకెల్ శ్రీను, అనిల్, నరేందర్, ఎడ్ల అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.